# ఐటీకి నిరాశ తప్పదు

**వచ్చే ఏడాదిలో 5 శాతం వృద్ధి • నియామకాలు అంతంతే: ఇక్రా**



ముంబై, మార్చి 18: దేశీయ ఐటీ రంగానికి నిరాశ తప్పేటట్లు కనిపించడం లేదు. గత కొన్నేండ్లుగా రెండంకెల వృద్ధిని నమోదు చేసుకుంటున్న దేశీయ ఐటీ రంగ సంస్థలకు వచ్చే ఏడాది మాత్రం సింగిల్ డిజిట్‌కు పరిమితంకానున్నదని సర్వే వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఐటీ కంపెనీల ఆదాయంలో వృద్ధి 3-5 శాతం మధ్యలో నమోదుకానున్నదని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేస్తున్నది. అలాగే ఆదాయం వృద్ధి అంతంత మాత్రంగానే ఉండనుండటంతో ఉద్యోగ నియామకాలకు బ్రేక్ వేసే అవకాశాలున్నాయని తెలిపింది. అయినప్పటికీ టాప్‌లైన్ వృద్ధిపై ఆందోళన వ్యక్తమైనప్పటికీ లాభదాయకత మాత్రం స్థిరంగా ఉంటుందని వెల్లడించింది. 250 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్న దేశీయ ఐటీ రంగ సంస్థల ఆపరేటింగ్ ప్రాఫిట్‌లో 21-22 శాతం వృద్ధిని అంచనావేస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో ఐటీ సంస్థల ఆదాయం కేవలం రెండు శాతం మాత్రమే వృద్ధిని నమోదు చేసుకున్నది. గతంలో అంచనావేసిన 3-5 శాతం స్థాయికి కూడా చేరుకోలేకపోయింది. అలాగే టాప్‌లైన్ వృద్ధి సరాసరిగా 9.2 శాతంగా ఉన్నది. అంతర్జాతీయ దేశాల్లో ఆర్థిక మాంద్యం చాయలు నెలకొనడం, ముఖ్యంగా రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం కొనసాగుతుండటం ఇందుకు కారణమని తెలిపింది.

**మహిళా ఉద్యోగ కల్పనలో వృద్ధి**

మహిళలకు ఉద్యోగ అవకాశాలు విరివిగా లభిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను క్యాంపస్‌లలో నిర్వహించిన రిక్రూట్‌మెంట్లలో 5 శాతం వరకు పెరిగారని తాజా నివేదిక వెల్లడించింది. 2022-23లో దేశవ్యాప్తంగా ప్రధానంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్లలో మహిళల వాటా 40 శాతానికి చేరుకున్నదని, క్రితం ఏడాది ఇది 35 శాతంగా ఉన్నట్లు రిక్రూట్‌మెంట్ ఆటోమేషన్ సంస్థ హిర్‌ప్రో నివేదికలో తెలిపింది. ఈ నివేదికను దేశవ్యాప్తంగా ఉన్న 5.50 లక్షల మంది బీటెక్ విద్యార్థుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా రూపొందించింది. ముఖ్యంగా ఐదు జోన్లవారీగా విడగొట్టి, సెంట్రల్, తూర్పు, ఉత్తర, దక్షిణ, పడమర ప్రాంతాల నుంచి సేకరించింది. ఉద్యోగ నియామకాలకు సంబంధించి జరిగిన పరీక్షల్లో పాల్గొన్న అత్యధిక మంది మహిళల్లో ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ), రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డీ) ఎంచుకున్నట్లు తెలిపింది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో అత్యధిక మంది మహిళలకు ఐటీ రంగానికి మొగ్గుచూపారు. జోన్లవారీగా చూస్తే 2022-23లో క్యాంపస్‌లలో నిర్వహించిన పరీక్షలో దక్షిణ భారతంలో అత్యధిక మంది 39 శాతం మంది హాజరయ్యారు. అలాగే తూర్పు భారతంలో తక్కువగా 24 శాతంగా ఉన్నది. పశ్చిమ జోన్ వాటా 34 శాతంగా, సెంట్రల్ జోన్ 28 శాతం, నార్త్ జోన్ వాటా 27 శాతంగా ఉన్నదని తెలిపింది.

*అంతర్జాతీయ దేశాలైన అమెరికా, యూరప్‌లో ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా లేకపోవడంతో కార్పొరేట్ సంస్థలు ఐటీపై పెట్టే ఖర్చును తగ్గించుకుంటున్నారు. దీంతో దేశీయ ఐటీ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది.*

*- దీపక్ జోత్వాని, ఇక్రా ఐటీ హెడ్*



## రూ.1,991కే ఫ్లై91 విమాన టికెటు

పనాజీ, మార్చి 18: గోవా కేంద్రంగా కార్యాకలాపాలు అందిస్తున్న ఫ్లై91..తొలి విమాన సర్వీసును గోవా నుంచి బెంగళూరుకు ఆరంభించింది. అలాగే బెంగళూరు నుంచి సింధుదుర్గ్‌ల మధ్య విమాన సర్వీసు కూడా అందుబాటులోకి వచ్చింది. విమాన సేవలు ప్రారంభ సందర్భంగా ఈ రెండు రూట్లలో విమాన టికెట్ ధరను రూ.1,991గా నిర్ణయించింది. అన్ని పన్నులు కలుపుకొని ఈ ధరను నిర్ణయించినట్లు కంపెనీ ఎండీ మనోజ్ చాకో తెలిపారు. మంగళవారం నుంచి హైదరాబాద్-గోవా రూట్‌లో విమాన సేవలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

## నిధుల సేకరణలో స్టార్టప్‌లు


న్యూఢిల్లీ, మార్చి 18: దేశీయ స్టార్టప్‌లు ఈ ఏడాది కొత్తగా 8-12 బిలియన్ డాలర్ల వరకు నిధులు సమీకరించే అవకాశాలున్నాయని వెంచర్ క్యాపిటల్ సంస్థ పీక్ ఎక్స్‌వీ ఎండీ రాజన్ ఆనందన్ తెలిపారు. ఇప్పటికే 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించాయి కూడా. గతేడాది 7 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించిన స్టార్టప్‌లు..ఈసారి మాత్రం లక్ష కోట్ల స్థాయిలో అవకాశం ఉన్నదని ఆయన చెప్పారు. ప్రస్తుతం 20 స్టార్టప్‌లు స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయ్యాయని, వచ్చే ఎనిమిదేండ్లకాలంలో వీటి సంఖ్య 100కి చేరుకునే అవకాశం ఉన్నదన్నారు.

# బీమా రంగంలోకి 54 వేల కోట్లు

**గత తొమ్మిదేండ్లలో వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు**

న్యూఢిల్లీ, మార్చి 18: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో బీమా రంగం దూసుకుపోతున్నది. గడిచిన తొమ్మిదేండ్లలో ఈ రంగంలోకి అక్షరాల రూ.54 వేల కోట్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. బీమా రంగంలోకి వచ్చే ఎఫ్‌డీఐల నిబంధనలను మరింత సరళతరం చేయడమే ఇందుకు కారణమని ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషి ఈ సందర్భంగా తెలిపారు. 2014లో బీమా రంగంలోకి ఎఫ్‌డీఐల పరిమితిని 26 శాతానికి పెంచిన మోదీ సర్కార్..ఆ మరుసటి ఏడాది 49 శాతానికి సవరించింది. విదేశీ పెట్టుబడులకు రాచబాటను వేస్తున్న కేంద్ర సర్కార్..2021లో ఏకంగా ఎఫ్‌డీఐల పరిమితిని 74 శాతానికి పెంచింది. దీంతో విదేశీ సంస్థలు భారీగా నిధులు కుమ్మరిస్తున్నారు. దీంతో డిసెంబర్ 2014 నుంచి జనవరి 2024 నాటికి బీమా రంగంలోకి మొత్తంగా రూ.53,900 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయని ఆయన తెలిపారు. మరోవైపు, బీమా మధ్యవర్తుల విభాగంలోకి ఎఫ్‌డీఐలను 100 శాతం అనుమతించిన విషయం తెలిసిందే.

**పెరిగిన బీమా సంస్థలు..**



ఇదే సమయంలో దేశంలో బీమా సేవలు అందించే సంస్థల సంఖ్య కూడా పెరిగింది. 2014లో 53గా ఉన్న బీమా సంస్థలు ఈ ఏడాది నాటికి 70కి చేరుకున్నాయని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ బీమా వినియోగం మాత్రం పెరగడం లేదు. 2013-14లో 3.9 శాతంగా ఉన్న సరాసరి బీమా వినిమయం 2022-23 నాటికి కేవలం 4 శాతానికి చేరుకున్నది. కానీ, బీమా సాంద్రత 52 డాలర్ల నుంచి 92 డాలర్లకు పెరగడం విశేషం. 2013-14లో రూ.21 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న బీమా రంగ సంస్థల ఆస్తుల విలువ మూడింతలు పెరిగి రూ.60 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అలాగే మొత్తం బీమా ప్రీమియం వసూళ్లు కూడా రెండింతలు పెరిగి రూ.3.94 లక్షల కోట్ల నుంచి రూ.10.4 లక్షల కోట్లకు చేరాయి. బీమా రంగంలోకి ప్రైవేట్ సంస్థల రాకను అనుమతిస్తూ ఆగస్టు 2000లో కేంద్రం నిర్ణయం తీసుకున్నది. అలాగే వీటిలో విదేశీ సంస్థలు 26 శాతం వరకు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం కూడా కల్పించింది. దీంతో విదేశీ సంస్థలు క్రమంగా పెట్టుబడులు పెడుతూ వచ్చాయి. దీంట్లో భాగంగా జూరిచ్ ఇన్సూరెన్స్-కొటక్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలు మధ్య కుదిరిన ఒప్పందంతో దేశీయ బీమా రంగంలోకి వచ్చిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఇదే కావడం విశేషం. గత నెలలో జాయింట్ వెంచర్‌లో వాటాను 70 శాతానికి పెంచుకుంటున్నట్లు జూరిచ్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# స్వల్ప లాభాల్లో సూచీలు



ముంబై, మార్చి 18: తీవ్ర ఒడిదొడుకుల మధ్య కొనసాగిన దేశీయ స్టాక్ మార్కెట్లు చివరకు లాభాల్లోకి వచ్చాయి. వచ్చే సమీక్షలో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలున్నాయంటూ వచ్చిన సంకేతాలు మదుపరులను అమ్మకాలవైపు నడిపించాయి. ఫలితంగా ప్రారంభంలో భారీగా విక్రయాలకు మొగ్గుచూపిన ఇన్వెస్టర్లు చివర్లో బ్లూచిప్ సంస్థల నుంచి లభించిన మద్దతుతో తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. సెన్సెక్స్ 104.99 పాయింట్లు పెరిగి 72,748.42 పాయింట్ల వద్దకు చేరుకోగా, మరో సూచీ నిఫ్టీ సైతం 32.25 పాయింట్లు అందుకొని 22,055.70 వద్ద స్థిరపడింది. మెటల్, ఆటో, కమోడిటీ రంగ షేర్లు లాభాల్లో ముగియగా..ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు పతనం చెందాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.5 శాతం బలపడగా, టాటా స్టీల్ 5 శాతం, మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటర్స్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా, మారుతి షేర్లు లాభాల్లో ముగిశాయి.

**ఆదానీ గ్రూపు షేర్ల పతనం**

అమెరికా లంచం కేసులో విచారణ వేగవంతం అవుతున్నట్లు వచ్చిన వార్తలు అదానీ గ్రూపు షేర్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. అదానీ టోటల్ గ్యాస్ 4.35 శాతం పతనమవగా, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేర్లు 3.40 శాతం, అంబుజా సిమెంట్ 2.81 శాతం, ఏసీసీ 2.43 శాతం నష్టపోయాయి.

# ఐపీఎల్ జోష్

**ఆర్‌సీబీ క్యాంప్‌లో కోహ్లీ**

**కేఎల్ రాహుల్‌కు లైన్ క్లియర్**

**రోహిత్ మద్దతు ఉంటుంది: హార్దిక్**



**అమ్మాయిల పొట్టి పోరు ముగిసింది..ఇక అబ్బాయిల వంతు మిగిలింది. మూడు రోజుల వ్యవధిలో ఐపీఎల్-17వ సీజన్‌కు అట్టహాసంగా తెరలేవబోతున్నది. నెలన్నర రోజులు అభిమానులకు పసందైన విందు అందించేందుకు ఫ్రాంచైజీలు పక్కా ప్రణాళికతో బరిలోకి దిగుతున్నాయి. ఓవైపు సార్వత్రిక ఎన్నికల శంఖారావం మొదలైతే..మరోవైపు ఐపీఎల్ ఫీవర్ దేశాన్ని ఓ ఊపు ఊపనుంది. విరామం తర్వాత విరాట్ కోహ్లీ ఆర్‌సీబీ క్యాంప్‌లో అడుగుపెడితే..కేఎల్ రాహుల్ ఫిట్‌నెస్ పరీక్షలో పాసయ్యాడు. రోహిత్ మద్దతుతో ముంబైని ముందుకు నడిపిస్తానని కొత్త కెప్టెన్ హార్దిక్ పాండ్యా చెప్పుకొస్తున్నాడు.**

బెంగళూరు: ఐపీఎల్ సమరానికి సమయం ఆసన్నమైంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అద్భుత విజయంతో అమ్మాయిల ఐపీఎల్ అట్టహాసంగా ముగియగా, అబ్బాయిల్లో ఎవరు గెలుస్తారన్న దానిపై ఇప్పటి నుంచే అంచనాలు మొదలయ్యాయి. ముంబై, చెన్నై రికార్డు స్థాయిలో ఆరోసారి టైటిల్‌ను దక్కించుకుంటాయా లేక..ఆర్‌సీబీ కప్ కల నెరవేరుతుందా.. ఢిల్లీ, పంజాబ్, లక్నో కప్‌ను ముద్దాడుతాయా? కోల్‌కతా, రాజస్థాన్, హైదరాబాద్ టైటిల్‌పై కన్నేసాయా అన్నది తేలనుంది.

**కోహ్లీ ప్రాక్టీస్:**

ఆర్‌సీబీ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఐపీఎల్ కోసం పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నాడు. వ్యక్తిగత కారణాలతో ఇటీవల ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు దూరంగా ఉన్న విరాట్.. తాజాగా ఆర్‌సీబీ ప్లేయర్లతో కలిసి ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. సోమవారం సహచర క్రికెటర్లతో కలిసి విరాట్ వామప్ చేశాడు. ఆర్‌సీబీ అమ్మాయిలు టైటిల్ గెలువడంతో ఈసారి అబ్బాయిలపై ఒత్తిడి నెలకొంది.

**రాహుల్ ఫిట్:**

లక్నో సూపర్‌జెయింట్స్ కెప్టెన్ కేఎల్ రాహుల్ ఫిట్‌నెస్ పరీక్ష పాసయ్యాడు. జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) సోమవారం రాహుల్‌కు లైన్‌క్లియర్ చేసింది. ఇంగ్లండ్‌తో తొలి టెస్టు సందర్భంగా గాయపడ్డ రాహుల్ మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే గాయం నుంచి తేరుకున్నప్పటికీ కొన్ని మ్యాచ్‌ల వరకు వికెట్‌కీపింగ్ చేయవద్దని రాహుల్‌కు ఎన్‌సీఏ వాళ్లు సూచించారు. ఈ నెల 24న తమ తొలి మ్యాచ్‌లో రాజస్థాన్‌తో లక్నో తలపడుతుంది.

**రాహుల్ మద్దతుతో:**

మాజీ కెప్టెన్ రోహిత్‌శర్మ మద్దతుతో ముందుకెళ్తానని ముంబై ఇండియన్స్ నూతన సారథి హార్దిక్ పాండ్యా పేర్కొన్నాడు. సోమవారం ప్రమోషన్ ఈవెంట్‌లో కోచ్ మార్క్ బౌచర్‌తో కలిసి పాండ్యా పాల్గొన్నాడు. 'ముంబైకి మళ్లీ తిరిగి రావడం సంతోషంగా ఉంది. రోహిత్ మద్దతుతో ముంబైని ముందుకు నడిపిస్తాను. అతని సహకారం కచ్చితంగా ఉంటుంది. రోహిత్ వారసత్వాన్ని కొనసాగిస్తాను. మేమిద్దరం కలిసి గత 10 ఏండ్లుగా ఆడుతున్నాం. నా కెరీర్ మొత్తం అతని కెప్టెన్సీలోనే ఆడాడు. అభిమానులను గౌరవిస్తాం... అదే సమయంలో జట్టు అవసరాలను గుర్తించాల్సి ఉంటుంది' అని అన్నాడు. ఇదిలా ఉంటే గాయపడ్డ జాసన్ బెహెన్‌డార్ఫ్ స్థానంలో ల్యూక్ వుడ్(ఇంగ్లండ్)ను ముంబై తీసుకుంది.

# రెజ్లింగ్ అడ్‌హాక్ కమిటీ రద్దు

**ఐవోఏ నిర్ణయం**

**డబ్ల్యూఎఫ్ఐకి పూర్తి బాధ్యతలు**



న్యూఢిల్లీ: రెజ్లింగ్ అడ్‌హాక్ కమిటీని భారత ఒలింపిక్ సమాఖ్య(ఐవోఏ) రద్దు చేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్(డబ్ల్యూఎఫ్ఐ)పై యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్(యూడబ్ల్యూడబ్ల్యూ) నిషేధం ఎత్తివేసిన నేపథ్యంలో ఐవోఏ ఈ నిర్ణయం తీసుకుంది. దీనికి తోడు వచ్చే నెలలో జరగనున్న ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ కోసం సెలెక్షన్ ట్రయల్స్‌ను అడ్‌హాక్ కమిటీ విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఐవోఏ పేర్కొంది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఐవోఏ ఈ చర్యలకు పూనుకుంది. ఇదిలా ఉంటే అడ్‌హాక్ కమిటీని రద్దు చేసిన ఐవోఏకు ఈ సందర్భంగా డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్‌సింగ్ కృతజ్ఞతలు తెలిపాడు. 'ఇక నుంచి పూర్తి స్థాయిలో డబ్ల్యూఎఫ్ఐ విధులు నిర్వర్తిస్తున్నది. దేశంలోని రెజ్లర్లందరికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం. త్వరలో జాతీయ క్యాంప్ ఏర్పాటు చేసి రెజ్లర్లకు శిక్షణ అందిస్తాం. ఒలింపిక్స్ లక్ష్యంగా ముందుకెళుతున్నాం. పారిస్ ఒలింపిక్స్‌కు ఐదు లేదా ఆరుగురు రెజ్లర్లు అర్హత సాధించే అవకాశముంది' అని సంజయ్ అన్నాడు.

# చాంపియన్ అల్కారజ్



ఇండియన్ వెల్స్: ఇండియన్ వెల్స్ టోర్నీలో స్పెయిన్ టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్కారజ్ చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం అర్ధరాత్రి(భారత కాలమానం)జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో అల్కారజ్ 7-6(5), 6-1తో డానిల్ మెద్వదెవ్‌పై అద్భుత విజయం సాధించాడు. ఈ క్రమంలో వరుసగా రెండో ఏడాది ఇండియన్ వెల్స్ ట్రోఫీని అల్కారజ్ సొంతం చేసుకున్నాడు. దీనికి తోడు గతేడాది వింబుల్డన్ గెలిచిన తర్వాత ఈ స్పెయిన్ బుల్‌కు ఇది తొలి టైటిల్. మరోవైపు మహిళల సింగిల్స్‌లో ఇగా స్వియాటెక్ 6-4, 6-0తో మారియా సకారీపై అలవోక విజయంతో ట్రోఫీని ముద్దాడింది.

# భారత్ పతక జోరు

**పోలిష్ షూటింగ్ గ్రాండ్‌ప్రి**



న్యూఢిల్లీ: పోలిష్ గ్రాండ్‌ప్రి షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు అదరగొడుతున్నారు. సోమవారం జరిగిన వేర్వేరు విభాగాల్లో మన షూటర్లు ఆరు పతకాలు ఖాతాలో వేసుకున్నారు. పురుషుల 50మీటర్ల రైఫిల్-3 పొజిషన్‌లో అఖిల్ షెరాన్ పసిడి పతకంతో మెరిశాడు. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో అఖిల్ 468.4 పాయింట్లతో టాప్‌లో నిలువగా, ప్యాట్రిక్ జనీ, లొంగో స్లాస్కా వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. పురుషుల 25మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో అనీశ్ భన్వాల పసిడి కైవసం చేసుకున్నాడు. పురుషుల రైఫిల్ 3 పొజిషన్‌లో నీరజ్‌కుమార్ రెండు కాంస్య పతకాలు సొంతం చేసుకోగా, మహిళల 3 పొజిషన్‌లో శ్రీయాంకకు కాంస్యం, అశి చౌక్సీకి రజతం లభించాయి.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.